విజయోత్సవాలకు అధిష్ఠానం దూరం!

అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా 3 సభల నిర్వహణకు కాంగ్రెస్ నిర్ణయం

ఢిల్లీ పెద్దలకు ఆహ్వానం..అధిష్ఠానం నిరాకరణ • ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడమే కారణమా?

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో విస్తృతంగా పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఇప్పుడు తెలంగాణకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. ఈ సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించాలని, ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి డిసెంబర్ 9వ తేదీలోగా మూడు భారీ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నిర్ణయించాయి. ఈ నెల 19న వరంగల్‌లో ఇందిరాశక్తి పేరుతో మహిళల సభ, ఈ నెల 25న యూత్ కోసం కరీంనగర్‌లో రెండో సభ, ఈ నెల 30న రైతుల కోసం మహబూబ్‌నగర్‌లో మూడో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో ఏ ఒక్క సభకు కూడా రాహుల్‌గాంధీ గానీ, ప్రియాంకగాంధీ గానీ రావడం లేదని తెలిసింది. ఆయా సభలకు రావాల్సిందిగా రాష్ట్ర పార్టీ ముఖ్యులు ఆహ్వానించినప్పటికీ వారు అంగీకరించలేదని తెలిసింది. విజయోత్సవ సభలకు పార్టీ పెద్దలు ముఖం చాటేస్తుండటంపై పార్టీలో పెద్ద చర్చ జరుగుతున్నది. కేవలం ఏడాదిలోనే రేవంత్ సర్కార్ ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్నదనే సమాచారం అధిష్ఠానానికి చేరిందని, అందుకే విజయోత్సవాలకు వచ్చేందుకు వెనకంజ వేస్తున్నారనే చర్చ సాగుతున్నది. దీంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందనే నివేదికలు ఇప్పటికే సొంత పార్టీ నేతలే అధిష్ఠానానికి చేరవేసినట్టు ప్రచారం జరుగుతున్నది. రైతులకు రైతుభరోసా ఇవ్వకపోవడం, రుణమాఫీ సరిగ్గా చేయకపోవడం, ధాన్యం కొనుగోలు సక్రమంగా చేయకపోవడం, దళితబంధు నిలిపేయడం, తులం బంగారం హామీని అమలు చేయకపోవడం, పెన్షన్లు పెంచకపోవడం, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న హామీని విస్మరించడం వంటివి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెంచుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణకు రావడం అంత శ్రేయస్కరం కాదనే అభిప్రాయం ఢిల్లీ పెద్దల్లో ఉన్నదని కాంగ్రెస్ చర్చించుకుంటున్నారు. రేవంత్ సర్కారు పనితీరుపై అధిష్ఠానం పెద్దలు కూడా అసంతృప్తిగానే ఉన్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. అందుకే విజయోత్సవాల సభలకు దూరంగా ఉండాలని పార్టీ పెద్దలు నిర్ణయించుకున్నట్టు కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది.

నిజామాబాద్ మేయర్ భర్త శేఖర్‌పై దాడిచేస్తున్న యువకుడు

నిజామాబాద్ మేయర్ భర్తపై దాడి

- కింద పడేసి తన్ని.. సుత్తెతో కొట్టిన ఆటోడ్రైవర్ రసూల్
- ప్లాట్ కబ్జా చేసి డబ్బులు అడుగుతున్నాడని ఆరోపణ
- దాడిని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టిన నిందితుడు

వినాయక్‌నగర్, నవంబర్ 18: నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూకిరణ్ భర్త శేఖర్‌పై ఓ యువకుడు దాడి చేసి గాయపర్చాడు. పైగా ఈ తతంగాన్నంతా రికార్డు చేయించి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, నిందితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దండు శేఖర్ సోమవారం సాయంత్రం నాగారం 80 క్వార్టర్స్‌లోని ఓ మెడికల్ షాపు వద్ద తన అనుచరులతో మాట్లాడుతున్నాడు. ఇంతలో అక్కడికొచ్చిన ఆటోడ్రైవర్ షేక్ రసూల్ అకస్మాత్తుగా శేఖర్‌పై దాడి చేశాడు. అతడు కిందపడిపోగా కాలితో తన్నాడు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న ఆటోలో నుంచి పెద్ద సుత్తె తీసుకొచ్చి కొట్టాడు. తప్పించుకునేందుకు యత్నించినప్పటికీ సుత్తె కణత భాగంలో బలంగా తగలడంతో తీవ్ర గాయమైంది. రక్తస్రావంతో కిందపడిపోయిన శేఖర్‌ను స్థానికులు ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ ఘటనను ఫోన్‌లో చిత్రీకరించి, దానితోపాటు మరో సెల్ఫీ వీడియోను కూడా రసూల్ సోషల్‌మీడియాలో పోస్టు చేశాడు. తన భూమిని శేఖర్ కబ్జా చేశాడని, చాలాసార్లు బతిమాలినా వినలేదని రసూల్ తెలిపాడు. గోపాల్ అనే వ్యక్తి తన భూమిలో కబ్జా పెట్టాడని, వారి వద్దకు వెళ్తే 2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని పేర్కొన్నాడు. ఆటో నడుపుకొనే తాను అంత ఇచ్చుకోలేనని, అందుకే తాను శేఖర్‌పై దాడి చేశానని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. పోలీసులు.. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కాంగ్రెస్ సభకు కాలేజీ గ్రౌండ్ ధ్వంసం

- ప్రభుత్వ కార్యక్రమం పేరిట మైదానంలో బహిరంగ సభ
- వరంగల్‌లో గ్రౌండ్‌ను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- రూ.40 లక్షలతో వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్ల ఏర్పాటు
- ప్రహరీ కూల్చివేత.. ఎస్‌హెచ్‌జీ మహిళల తరలింపు

ఇందిరా మహిళా శక్తి సభ కోసం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం ప్రహరీని కూల్చిన అధికారులు

వరంగల్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సాధికారతకు పాటుపడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదు. క్రీడాపాలసీని తెస్తామని, మైదానాలను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే చెప్తున్న మాటలు సత్యదూరమని తెలుస్తున్నది. ఇందిరా మహిళా శక్తి పేరిట మంగళవారం హనుమకొండలో నిర్వహించే బహిరంగసభ కోసం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌ను పూర్తిగా ధ్వంసం చేయడమే ఇందుకు నిదర్శనం. స్టేజీ, టెంట్లు, బారికేడ్లు, లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు చేసేందుకు గ్రౌండ్ అంతటా ఇష్టం వచ్చినట్టుగా రంధ్రాలు చేశారు. ప్రభుత్వ కార్యక్రమం కావడంతో అధికారులే దగ్గరుండి అన్ని పనులూ చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మహిళలు, సాధారణ జనం వచ్చేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌కు ఉన్న ప్రహరీని మూడు చోట్ల కూల్చేశారు. ఈ గ్రౌండ్‌కు రెండు గేట్లు ఉండగా, మరో మూడు చోట్ల ప్రహరీ కూల్చడంపై క్రీడాకారులు, వాకర్స్ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. కలెక్టరేట్, డీఐజీ బంగ్లా మధ్యలో ఉన్న ఈ మైదానానికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేల మంది వాకింగ్, ఆటల కోసం వస్తుంటారు. డిగ్రీ కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ గ్రౌండ్‌లో నిత్యం జరుగుతుంటాయి. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు ఉన్న ప్రాధాన్యత నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 లక్షలతో అభివృద్ధి చేసింది. రూ.20 లక్షల చొప్పున రెండు దశల్లో నిధులు కేటాయించి వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను, సోలార్ లైట్లను ఏర్పాటు చేసింది. మహిళలకు ఇబ్బంది లేకుండా మొబైల్ టాయిలెట్ సదుపాయం కల్పించింది. ఇలాంటి గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగసభ కోసం ఇష్టం వచ్చినట్టు ధ్వంసం చేయడంపై విమర్శలొస్తున్నాయి.

జన సమీకరణకు అధికారులకు టార్గెట్లు

'ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాలు'లో భాగంగా ఇందిరా మహిళాశక్తి పేరిట హనుమకొండలో నిర్వహిస్తున్న బహిరంగసభ విజయవంతం చేసేందుకు జన సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు టార్గెట్లు విధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఊరిలోని స్వయం సహాయక బృందాల్లోని (ఎస్‌హెచ్‌జీ) మహిళలు ఈ సభకు కచ్చితంగా రావాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారు (డీఆర్డీవో)లకు మహిళా జన సమీకరణ బాధ్యతలను అప్పగించింది. ఎంపీడీవోలు, వీ వోలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులలోని ప్రతి మహిళలను సభకు రావాలని ఒత్తిడి తెస్తున్నారు. జనసమీకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 900 ఆర్టీసీ బస్సులను వాడుకుంటున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోనే 150 బస్సులను కేటాయించింది.

రేవంత్ పాలనకు ఫెయిల్ మార్క్స్

- కాంగ్రెస్ పాలనపై 61% మంది పెదవి విరుపు
- పాలన ఓకే అన్న 27% మంది, చెప్పలేమన్న 12% ప్రజలు
- అమలుకాని గ్యారెంటీలు, హైడ్రా కూల్చివేతలు, రైతుల కన్నీరు, మూసీ దమనకాండ, లగచర్ల హింసాత్మక ఘటనలతో సర్కారుపై ఆగ్రహం
- కాంగ్రెస్‌పార్టీ అనుకూల మీడియా పోల్‌లో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ అనుకూల ఒక టీవీ చానల్ శనివారం నిర్వహించిన పోల్‌లో రేవంత్ సర్కార్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తమైంది. 11 నెలల రేవంత్ సర్కారు పాలన ఎలా ఉన్నదంటూ సదరు టీవీ చానల్ ఎక్స్ వేదికగా పోల్ నిర్వహించింది. దీనికి 61% మంది రేవంత్ సర్కారు పాలన బాగోలేదని తేల్చిచెప్పారు. 12% మంది ఏమీ చెప్పలేమని బదులిచ్చారు. కేవలం 27% మంది కాంగ్రెస్ పాలన పర్వాలేదని జవాబిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫలితాలు రావడంతో 'ఎక్స్' ఖాతా నుంచి ఆ పోల్‌ను సదరు మీడియా చానల్ 45 నిమిషాల్లోనే తొలగించింది.

అన్ని వర్గాల్లో అసంతృప్తి

పోల్ కొనసాగిన దాదాపు 45 నిమిషాల వ్యవధిలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను నెటిజన్లు కామెంట్ల రూపంలో ఎండగట్టారు. ఆరు గ్యారెంటీల పేరిట రేవంత్ ప్రభుత్వం తమను మోసం చేసిందని దీపక్ అనే నెటిజన్ కామెంట్ చేయగా, హైడ్రా కూల్చివేతలతో మధ్యతరగతి కలలను కాంగ్రెస్ సర్కారు చిదిమేసిందంటూ నరోత్తమ్ అనే మరో నెటిజన్ వాపోయాడు. ధాన్యం కొనకుండా రైతన్న కన్నీరుకు ప్రభుత్వం కారణమైందంటూ కిరణ్ అనే వ్యక్తి ఖాతా నుంచి పోస్ట్ కనిపించగా, మూసీ పరివాహకంలోని పేదల ఇండ్ల కూల్చివేత, లగచర్ల హింసాత్మక ఘటనలు కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠను దిగజార్చాయంటూ నాని అనే మరో నెటిజన్ పేర్కొన్నారు.

గ్రూప్-3కి 50% అభ్యర్థుల డుమ్మా

- మధ్యస్తంగా ఎకానమీ ప్రశ్నలు
- ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలకు అభ్యర్థులు భారీగా గైర్హాజరయ్యారు. ఆది, సోమవారాల్లో నిర్వహించిన పరీక్షలకు ఏకంగా 50శాతం అభ్యర్థులు డుమ్మా కొట్టారు. గ్రూప్-3 పరీక్షకు మొత్తం 5,36,400 మంది దరఖాస్తు చేయగా, 76శాతం అభ్యర్థులు మాత్రమే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో సోమవారం నిర్వహించిన పేపర్- 3 పరీక్షకు 2,69,483 (50.24%) మాత్రమే హాజరయ్యారు. 49.76% అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లాలవారీగా తీసుకుంటే నల్లగొండలో 71.30%, సూర్యాపేటలో 66.91%, మహబూబ్‌నగర్‌లో 63.58% అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఫలితాలు విడుదల చేసే అవకాశాలున్నట్టుగా తెలిసింది. ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పేపర్‌లో హైడ్రా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రశ్నలొచ్చాయి.

మధ్యస్తంగా ప్రశ్నలు: ప్రభాకర్ చౌటి

సోమవారం ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పేపర్‌కు పరీక్షను నిర్వహించగా, ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టుగా పోటీ పరీక్షల శిక్షకుడు ప్రభాకర్ చౌటి విశ్లేషించారు. ప్రశ్నలు అంత సులభంగా, కఠినంగా కాకుండా మధ్యస్తంగా ఉన్నట్టు అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక సర్వే, బడ్జెట్, తెలంగాణ బడ్జెట్, ఎకనామిక్ సర్వే, సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్, కుటుంబ సర్వే నుంచి అధికంగా ప్రశ్నలిచ్చినట్టు చెప్పారు. గణాంకాలను గుర్తుంచుకున్న వారికి మాత్రమే అనుకూలమని, మిగతా వారికి అంత సులభంకాదని తెలిపారు. సీరియస్‌గా ప్రిపేర్ అయిన వారికి 80-90 మార్కులు తెచ్చుకోవచ్చని, ప్రతిభావంతులు 90కి పైగా మార్కులు తెచ్చుకోవచ్చని అంచనావేశారు. సివిల్ సర్వీస్ పరీక్షల కాన్సెప్ట్ తరహాలో ప్రశ్నలొచ్చినట్టు పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి ప్రిపేర్ అవుతున్న వారు ప్రయోజనం పొందుతారన్నారు.

సంక్రాంతికి సన్నబియ్యం లేనట్టే!

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. సన్న వడ్ల కొనుగోలు కోసం 4వేల ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఎస్ చౌహాన్ తెలిపారు. సన్నాలు ఎక్కువగా ఉత్పత్తయ్యే గ్రామాలను జీపీఎస్ ద్వారా గుర్తించి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఒకవేళ ఏదైనా గ్రామంలో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోతే దగ్గర్లోని మరో గ్రామంలోని కేంద్రంలో విక్రయించాలని సూచించారు.

నేడు నింగిలోకి జీశాట్-20

చెన్నై, నవంబర్ 18: ఇస్రోకు చెందిన జీశాట్-20(జీశాట్-ఎన్2) ఉపగ్రహం ఈనెల 18న యూఎస్ కాలమాన ప్రకారం సాయంత్రం 6.31 గంటలకు (భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 12.01 నిమిషాలకు) స్పేస్ ఎక్స్ రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకెళ్లనుంది. ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ ఇందుకు వేదిక కానుందని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ వియాన్ వార్తా సంస్థకు వెల్లడించారు. బ్యాకప్ ప్రయోగ తేదీగా యూ ఎస్ కాలమాన ప్రకారం మంగళవారం ఉదయం 9.33 గంటలను ఎంపిక చేశారు. 4.7 టన్నుల బరువైన ఈ కమ్యూనికేషన్ ఉపగ్రహం అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌తోపాటు భారత్ మొత్తాన్ని కవర్ చేసి బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తుంది. భారత దేశ రాకెట్లు 4 వేల కిలోలు బరువు గల ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీశాట్-20ని స్పేస్ ఎక్స్‌కు చెందిన రాకెట్ ద్వారా ప్రయోగించనున్నారు.

గుజరాత్‌లో ర్యాగింగ్‌కు వైద్య విద్యార్థి బలి

ధర్‌పూర్, నవంబర్ 18: గుజరాత్ ధర్‌పూర్‌లోని జీఎంఈఆర్ఎస్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ వల్ల ఓ విద్యార్థి (18) మృతి చెందాడు. వసతి గృహంలో సీనియర్లు మూడు గంటలపాటు నిలబెట్టడంతో మొదటి సంవత్సరం విద్యార్థి అనిల్ మెథానియా అచేతన స్థితిలోకి వెళ్లి మరణించాడని ఎఫ్ఐఆర్ నమోదైంది. 'వాళ్లు మమ్మల్ని మూడు గంటలపాటు నిలబడి పరిచయం చేసుకోవాలని, ఆందోళన చేయకూడదని ఒత్తిడిచేశారు. చివరికి మాతోపాటు నిలబడిన ఓ విద్యార్థి పడిపోయాడు. మేం అతడిని వెంటనే దవాఖానకు తీసుకెళ్లాం. అక్కడ అతడు చనిపోయాడని ప్రకటించారు' అని ఓ విద్యార్థి వెల్లడించారు. 15 మంది నిందితులపై కేసు నమోదైంది.

మధుకర్ హత్యకు కుట్రపై విచారణ జరపాలి

- వేర్వేరు పోలీస్ స్టేషన్లలో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు
- పెద్దపల్లి జిల్లాలో మంత్రి శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్/కమాన్‌పూర్/కాటారం, నవంబర్ 18: మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధుకర్ హత్యకు కుట్ర జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ.. వేర్వేరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. పుట్ట మధుకర్ హత్యకు కుట్రపై పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి స్వయంగా చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని బీఆర్ఎస్ కాటారం మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, జిల్లా నేత జక్కు శ్రావణ్ డిమాండ్ చేశారు.

ఒక్కో ఎమ్మెల్యేకు బీజేపీ 100 కోట్ల ఆఫర్

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గౌడ ఆరోపణ

బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ మండ్య ఎమ్మెల్యే రవి కుమార్ గౌడ సోమవారం ఆరోపించారు. కిత్తూరు ఎమ్మెల్యే బాబా సాహెబ్ డీ పాటిల్, చిక్కమగళూరు ఎమ్మెల్యే హెచ్‌డీ తమ్మయ్యను బీజేపీ సంప్రదించిందన్నారు. తన ఆరోపణలను రుజువు చేయడానికి సాక్ష్యాధారాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఎమ్మెల్యేలు స్పందిస్తూ, తమను బీజేపీ కానీ, ఇతరులు కానీ సంప్రదించలేదని, సొమ్ము ఇస్తామని ఆశపెట్టలేదని వివరణ ఇచ్చారు. బీజేపీ స్పందిస్తూ, ఈ ఆరోపణలను రుజువు చేయాలని సవాల్ విసిరింది. సీఎం సిద్ధరామయ్య కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. తమ ఎమ్మెల్యేలకు 50 కోట్ల చొప్పున బీజేపీ ఆఫర్ చేస్తున్నదని, తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు.

తిరగబడ్డ పత్తి రైతులు

- కొర్రీలతో అరిగోస పెడుతున్నారంటూ ఆవేదన
- ఖమ్మం మార్కెట్ పత్తి యార్డులో సీసీఐ అధికారుల ఘెరావ్
- కొనుగోలు కేంద్రం పెట్టకుండా వ్యాపారులకు సహకరిస్తున్నారంటూ పత్తి రైతుల మండిపాటు
- తిరుమలాయపాలెంలో మిల్లుకు తాళం వేసి నిరసన

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోల్‌తండా వద్ద కాటన్ మిల్లు గేటుకు తాళం వేస్తూ సీసీఐ అధికారులను నిలదీస్తున్న పత్తి రైతులు

ఖమ్మం, నవంబర్ 18 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి యార్డు సందర్శనకు వచ్చిన సీసీఐ అధికారులపై పత్తి రైతులు సోమవారం తిరగబడ్డారు. కాగా ఇదే జిల్లా తిరుమలాయపాలెంలో పత్తి మిల్లుకు తాళం వేసి రైతులు నిరసన తెలిపారు. వివరాలు ఇలా.. ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయలేదని, అనేక కొర్రీలు పెట్టి తమను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారిని ఘెరావ్ చేశారు. సీసీఐ మేనేజర్ అర్జున్, అసిస్టెంట్ మేనేజర్ అవినాశ్ ఖమ్మం ఏఎంసీ పత్తి యార్డులో క్రయవిక్రయాల పరిశీలనకు వచ్చారు. వీరిని చూసి ఆగ్రహానికి గురైన రైతులు వారిని చుట్టుముట్టారు. ఇక్కడి ఖరీదుదారులు సవాలక్ష కొర్రీలతో తమను అరిగోస పెడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయకుండా పరోక్షంగా ప్రైవేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమ శాతం 12లోపు ఉన్నదీ లేనిదీ తమకు తెలియకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని ఆ వేదన వ్యక్తం చేశారు. సీసీఐ అధికారుల వైఖరి కారణంగానే తాము మద్దతు ధర పొందలేక పోతున్నామని మండిపడ్డారు. అక్కడికి వచ్చిన జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఖమ్మం మార్కెట్లో సీసీఐ కేంద్రం ఏర్పాటు విషయంలో మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

గోల్‌తండాలో కాటన్ మిల్లుకు తాళం

తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలోని భాగ్యలక్ష్మి కాటన్ మిల్లు వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. తమ పత్తిని కొనుగోలు చేయని సీసీఐ అధికారులు.. ప్రైవేటు వ్యాపారులు తెచ్చిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటన్ మిల్లు గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. వారు కూడా రైతులే అనుకున్నామని అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.

వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు నిలిచిపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయిస్తున్న రైతులు

సీసీఐ కేంద్రాల్లో ప్రైవేట్ పత్తి నిల్వలు

- మూడు రోజుల క్రితం జీఎం తనిఖీల్లో వెలుగులోకి
- స్టాక్ బయటకు వెళ్లే వరకు కొనుగోళ్లు ఆపాలని ఆదేశం
- సీసీఐ పర్చేజింగ్ అధికారి సుశీల్‌పై బదిలీ వేటు
- క్రయవిక్రయాలు లేక తక్కువ ధరకే ప్రైవేట్‌కు విక్రయం

నెక్కొండ, నవంబర్ 18: వరంగల్ జిల్లా నెక్కొండలో ఏర్పాటు చేసిన రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ప్రైవేట్ పత్తి నిల్వలు వెలుగుచూశాయి. గత శుక్రవారం సీసీఐ జీఎం తనిఖీల్లో ఈ విషయం బయటకు రాగా.. ఆయన ఆగ్రహం వ్యక్తంచేయడంతోపాటు ప్రైవేట్ పత్తి బయటకు వెళ్లే వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని ఆదేశించారు. ఇందుకు బాధ్యుడైన సీసీఐ పర్చేజింగ్ అధికారి సుశీల్‌పై బదిలీ వేటు వేశారు. ఈ విషయాన్ని మూడు రోజులుగా సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచారు. విషయం తెలియని రైతులు సోమవారం పలు వాహనాల్లో పత్తిని ఆయా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. క్రయవిక్రయాలు లేక అక్కడే వేచి ఉండటంతో వాహనాలు బారులు తీరాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పడంతో రైతులు చేసేది లేక, గిట్టుబాటు ధర దక్కకపోయినా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారు. సీసీఐ మద్దతు ధర రూ.7,220 నుంచి రూ.7,521 వరకు ఉండగా.. ప్రైవేట్ వ్యాపారులు రూ.6,500 కంటే తక్కువ ధరకే కొనుగోలు చేశారు.

పురుగు మందు డబ్బాతో 'ప్రజావాణి'కి

- ఓ అధికారి తమ భూమి పట్టా చేసుకున్నాడని ఆరోపణ
- కరీంనగర్ కలెక్టరేట్‌లో దళిత కుటుంబం నిరసన

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 18 : కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన దళిత మహిళ మేకమల్ల సుగుణకు జమ్మికుంటలోని సర్వే నంబర్ 761లో భూమి ఉన్నది. అది తమదేనంటూ ఓ ప్రభుత్వ అధికారి తప్పుడు రికార్డులతో కాజేసే ప్రయత్నం చేయగా, సుగుణ కోర్టులో కేసు వేసింది. దీనిపై విచారణ జరుగుతుండగానే సదరు అధికారి తన పేర రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, గతంలో జరిగిన 'ప్రజావాణి'లో బాధిత కుటుంబ సభ్యులు ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. ఆత్మహత్యకు పాల్పడితే న్యాయం జరుగుతుందేమోనన్న ఆలోచనతో పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'కి వచ్చారు. దీంతో పోలీసులు డీఆర్‌వో వద్దకు తీసుకెళ్లారు. సుగుణ భర్త, కూతురు, కొడుకు తమకు జరుగుతున్న అన్యాయాన్ని డీఆర్‌వోకు వివరించగా, వెంటనే అధికారులకు ఫోన్ చేసి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో వారు వెనుదిరిగారు.

ట్రిపుల్ ఆర్ కోసం భూముల ధరల సవరణ

కలెక్టర్లకు అధికారం కల్పించిన ప్రభుత్వం • ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా హరిచందన

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపల నిర్మించ తలపెట